
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు
5
బుధవారం 18 సెప్టెంబరు 2024

ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా రాఘవేంద్ర

కర్నూలు, సెప్టెంబరు 17: కర్నూలు ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా రాఘవేంద్ర బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా వాసి అయిన ఈయన 2012 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన వారు. విశాఖపట్నం, కడప జిల్లాలో డీఎస్పీగా పని చేశారు. గత ఏడాది అడిషినల్ ఎస్పీగా పదోన్నతి పొంది పల్నాడు జిల్లా అడిషినల్ ఎస్పీగా నియమితులయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఈయన కర్నూలు ఇంటెలిజెన్స్ అడిషినల్ ఎస్పీగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఈయనకు సీఐలు, ఎస్ఐలు సిబ్బంది స్వాగతం పలికారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

● జాయింట్ కలెక్టర్ బి.నవ్య


స్వచ్ఛతా హి సేవా ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ప్రజాప్రతినిధులు

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. మంగళవారం నగర పాలక సంస్థ అధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా-2024 లో భాగంగా కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ వరకు ర్యాలీ, మానవహరం కార్యక్రమాన్ని జేసీతో పాటు నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, నగర పాలక కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌లు జెండా ఊపి ర్యాలిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీపీవో నాగరాజునాయుడు, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే విశ్వేశ్వరరెడ్డి, ఎంఈలు షాకీర్, శేషసాయి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, డీఈ నరేష్, ఏఈ దినేష్, డీఎస్‌డీవో భూపతిరావు తదితరులు పాల్గొన్నారు.

- కర్నూలు న్యూసిటీ

మంటపుట్టిస్తున్న ఉల్లి, వెల్లుల్లి

● అమాంతంగా పెరిగిన ధరలు



నెల రోజులుగా పెరిగిన ధరలతో సామాన్యుడు కుదేలవుతున్నాడు. ప్రతిరోజూ వంటకు వినియోగించే ఉల్లి, వెల్లుల్లి, వంట నూనె ధరలు అమాంతంగా పెరిగాయి. కిలో వెల్లుల్లి రూ.400, ఉల్లి గడ్డలు రూ.60కు పెరిగాయి. దీనికి తోడు వంట నూనెపై దిగుమతి సుంకం పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడమే తరువాయి వాటి ధరలు కూడా పెరిగాయి. మూడు రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చితే నేడు లీటరుపై రూ.20 నుంచి రూ.30 వరకు పెంచడంతో గృహిణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త సరుకుపై కాకుండా నిల్వ ఉన్న సరుకును కూడా అధిక ధరలకు విక్రయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎప్పటి నుంచో ఎక్కువ మంది ఉపయోగించే పామాయిల్, సన్‌ఫ్లవర్ ధరలు అమాంతంగా పెరగమే కాకుండా హోల్‌సేల్‌లో అమ్మేవారు ఆయిల్ లేదని చెబుతున్నారు.

-మద్దికెర

రాచరిక వ్యవస్థకు చెల్లు

● గూడూరులో స్నేహ పూర్వక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం


గూడూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్పుల అనంతరం విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ శివకుమార్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు స్నేహపూర్వక కార్యాలయాలుగా మారాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బ్రిటీష్ కాలం నాటి రూల్స్ బద్దలయ్యాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూపురేఖలు మారిపోయాయి. మంగళవారం గూడూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్పులు కనిపించాయి. సబ్ రిజిస్ట్రార్ కూర్చునే ఎత్తయిన పోడియంను తొలగించి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మాదిరిగానే అధికారుల సీటింగ్‌లో మార్పు చేశారు. ప్రజలకు అన్ని విధాల అందుబాటులో ఉండేలా సబ్ రిజిస్ట్రార్ కుర్చీని చేశారు. సబ్ రిజిస్ట్రార్ శివ కుమార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయంలో మార్పులు చేపట్టామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

- గూడూరు

కర్నూలు యార్డుకు రాష్ట్రంలోనే గుర్తింపు

● సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు


సద్దల విక్రయాన్ని ప్రారంభిస్తున్న సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 17: కర్నూలు మార్కెట్ యార్డులో మంగళవారం రైతులు తెచ్చిన సద్దలను వ్యాపారుల చేత కొనుగోలు చేయించే కార్యక్రమాన్ని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు మార్కెట్ యార్డులో వివిధ పంట ఉత్పత్తుల విక్రయాలను ఏడాది అంతా రైతుల నుంచి కమీషన్ ఏజెంట్లు, వ్యాపారుల చేత కొనుగోలు చేయిస్తున్నామని అన్నారు. ఇంత పెద్ద ఎత్తున పంట ఉత్పత్తులను కొనుగోలు చేసే మార్కెట్ కమిటీ రాష్ట్రంలో కర్నూలే అని తెలిపారు. ఉల్లిగడ్డలు, ఎండుమిర్చి, కూరగాయలు, వేరుశనగ, కందులు, మొక్కజొన్న తదితర 20 రకాల పంట ఉత్పత్తులు కర్నూలు యార్డులోనే అమ్ముడుపోవడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సెక్రటరీలు వెంకటేశ్, రెహిమాన్, సూపర్‌వైజర్లు, కేశవరెడ్డి, శివన్న, నాగేష్ పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

● విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసిన ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ బి.నవ్య


విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ డా.బి.నవ్య

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 17: నులి పురుగులను నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని ఇన్‌చార్జి కలెక్టర్ డా.బి. నవ్య అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని ఎ.క్యాంపు ఇందిరాగాంధీ స్మారక నగర పాలక ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి కలెక్టర్ విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పసిపిల్లలు, బాలబాలికల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనతకు కారణమయ్యే నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కింద జిల్లాలో ఉన్న 6,39,941 మంది పిల్లలకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్న లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు వేయించుకోని పిల్లలకు ఈ నెల 25న పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ హేమలత, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మి, డీఈవో శ్యామూల్, డీఎంవో నూకరాజు, డెమో శ్రీనివాసులు శెట్టి, డైస్ మేనేజర్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంపై వైసీపీ నాయకుడి కన్ను

రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు


దొడ్డి గ్రామంలో ఆర్అండ్‌బీ స్థలాన్ని చదును చేస్తున్న వైసీపీ నాయకుడు
దొడ్డి గ్రామంలో యంత్రంతో కొండ రాళ్లను పగులకొడుతున్న దృశ్యం

కోసిగి, సెప్టెంబరు 17: మండల పరిధిలోని దొడ్డి బెళగల్ గ్రామానికి సమీపంలోని ప్రభుత్వ స్థలంపై వైసీపీ నాయకుడి కన్ను పడింది. ఎక్స్‌కవేటర్లతో చదును చేసి ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా రెవెన్యూ అధికారులు వచ్చి అడ్డుకున్నారు. దొడ్డి బెళగల్ గ్రామ సమీపంలోని కొండకు ఆనుకుని ఉన్న సర్వే నెం.400లో అదే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఎకరా 90 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఆ పక్కనే ఆర్అండ్‌బీకి చెందిన 50 సెంట్ల స్థలంతోపాటు 50 సెంట్ల కొండపోరంబోకు భూమి కూడా ఉంది. ఈ భూమిని చదును చేసి తాను కొన్న భూమిలో కలిపేసుకోవాలనే ప్రయత్నం చేశాడు. ఇందులోభాగంగా ఎక్స్‌కవేటర్లతో ఆ భూమిని చదును చేయించడంతోపాటు కొండ బండరాళ్లను పగులగొట్టించే పనులు మొదలు పెట్టాడు. గ్రామస్థులు గమనించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ స్థలం వరకు హద్దులు వేయించారు.

రేపటి నుంచి ఇసుక అమ్మకాలు

● సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో బుకింగ్

● ప్రస్తుతానికి నాలుగు చోట్ల నిల్వలు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 17:

జిల్లాలో ఈ నెల 19 నుంచి ఇసుక అమ్మకాలు ప్రారంభించనున్నట్లు గనుల శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో పడవల ద్వారా తుంగభద్ర నది నుంచి ఇసుకను బయటకు తీసి స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. డ్రెడ్జింగ్ చేయడానికి, నది నుంచి స్టాక్ పాయింట్‌కు ఇసుక తరలించేందుకు అయ్యే ఖర్చులు కలుపుకొని టన్ను ఇసుక రూ.380గా ప్రభుత్వం నిర్ణయించింది. ఇక స్టాక్ పాయింట్ నుంచి దూరాన్ని బట్టి రవాణా చార్జీలు అదనంగా ఉంటాయి. ఆన్‌లైన్‌తో పాటు సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా ఇసుక కోసం బుకింగ్ చేసుకోవచ్చు. ఇప్పటికే సి. బెళగల్ మండలం పరిధిలో నాలుగు ప్రాంతాల్లో ఇసుక పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వారు రసీదు చూపించి తీసుకెళ్లవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక సరఫరా చేసే వాహనాల రవాణా చార్జీలు ఒకే విధంగా ఉండేలా ఖరారు చేస్తూ కూటమి ప్రభుత్వం ఆదేశాలు జరీ చేసింది.





● వర్షాల రాకతో జాప్యం..

తుంగభద్ర ఎగువన కురిసిన వర్షాల కారణంగా నీటి ప్రవాహం ఎక్కువ గా ఉండటంతో తవ్వకాలకు జాప్యం జరుగుతూ వస్తోంది. సి బెళగల్ మండలంలోని యార్డుల్లో ఇసుక నిల్వలు తరిగి పోవడంతో జిల్లాలో కొంత ఇసుక కొరత ఏర్పడింది. దీంతో వీలైనంత త్వరగా డీసిల్టేషన్ ద్వారా ఇసుక అందుబాటులోకి తీసుకురావడానికి జిల్లా యంత్రాంగం శరవేగంగా కదిలింది. బోట్ల ద్వారా డీసిల్టేషన్ చేసేందుకు ఆసక్తి కలిగిన బోట్స్ మన్ సొసైటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. మొత్తం గా 8 సొసైటీలు ఆసక్తి చూపగా వాటిని ఎంపానెల్ చేశారు. ప్రస్తుతం రోజుకు వెయ్యి టన్నుల ఇసుక వెలికి తీస్తున్నారు. పూర్తి స్థాయిలో డీసిల్టేషన్ మొదలైతే జిల్లాకు సరిపడా డిమాండ్‌ను అందుకోవచ్చని భావిస్తున్నారు.

● త్వరలో మరింత తగ్గుదలకు అవకాశం..

పర్యావరణ అనుమతులు రాక పోవడంతో ప్రజలకు ఇసుక సరఫరా కాస్త భారంగా మారిన పరిస్థితులు నెలకొన్నాయి. అనుమతి వచ్చాక ఇసుక ధరలు మరింత తగ్గుతాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో దాదాపు 11 రీచ్‌లు ఉండగా వీటన్నింటికి పర్యావరణ అనుమతులు రానున్నాయి. నేరుగా రీచ్‌ల నుంచి ఇసుక సరఫరా ప్రారంభం కానుంది. అదే జరిగితే ధరలు మరింత తగ్గి కేవలం కూలీలు, రవాణా చార్జీలతోనే ఇసుక సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు.

● రోజుకు ఐదు వేల టన్నులు అవసరం



జిల్లా అవసరాలకు సరాసరి రోజుకు 5 వేల టన్నుల ఇసుక అవసరమవుతోంది. కాగా డీసిల్టేషన్ పాయింట్లకు దగ్గర్లో ఏర్పాటు చేసిన యార్డుల వద్ద విక్రయాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సీసీ కెమెరాలు అమర్చారు. కంప్యూటర్లు, ప్రింటింగ్ యంత్రాలను కూడా తీసుకొచ్చారు. యార్డుల వద్ద ఇన్‌చార్జీలను కూడా నియమించారు. ఉచిత ఇసుక పాలసీ అమలుకు సంబంధించి మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు అధికారులను (మాస్టర్ ట్రైనర్స్)ను ఎంపిక చేసి శిక్షణ కూడా ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

● పాలసీ అమలుకు సమయం ఆసన్నం

ఇసుక పాలసీ అమలుకు సమయం ఆసన్నమైంది. ఇసుక రీచ్‌లలో తవ్వకాలకు అనుమతులు లేకపోవడంతో కొరతను తీర్చేందుకు ప్రభుత్వం డీ సిల్టేషన్ పాయింట్లను ప్రతిపాదించింది. తుంగభద్ర బ్యారేజ్ దిగువన సుంకుసుల డ్యామ్ ఎగువన డీసిల్టేషన్ పాయింట్లు ఉన్నాయి. ఈ రెండు చోట్ల 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక వెలికి తీశారు. తొలుత సి బెళగల్ మండలం పరిధిలోని కొత్తకోట, సింగవరం, ఈర్లదిన్నెల్లో తవ్వకాలు జరుపుతున్నారు. కానీ ఇటీవల ముడుమాల, పల్‌దొడ్డి గ్రామాల వద్ద రీచ్‌ల్లో 3.57 లక్షల టన్నుల ఇసుక తవ్వకాలకు పర్యావరణ శాఖ అనుమతి ఇచ్చింది. కొత్తగా గుడికంబాలి, నదిచాగి, మరళి గ్రామాల్లో 3.37 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాల కోసం అనుమతులు కావాలంటూ బుధవారం పర్యావరణ శాఖకు గనుల శాఖ లేఖ రాసింది. ఈ ఇసుక మొత్తాన్ని యార్డులకు తరలించి ఇసుక విక్రయాలు ప్రారంభించేదుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.


● ఆన్‌లైన్ బుకింగ్‌పై అవగాహన



ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుకను బుకింగ్ చేసుకునేందుకు కర్నూలు రూరల్, పత్తికొండ, ఆదోని రెవెన్యూ డివిజన్లలో గ్రామ సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ఇసుక బుకింగ్ విధానంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈనెల 19 నుంచి ఆన్‌లైన్ ఇసుక విధానం అమలులోకి వస్తుంది. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుకను సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

- రాజశేఖర్, డీడీ, గనుల శాఖ

నిమజ్జనానికి తరలుతున్న భారీ మట్టి వినాయకుడి విగ్రహం






భారీ గణేశుడికి బైబై

● ఘనంగా ఎకో ఫ్రెండ్లీ వినాకుడి నిమజ్జనం

● రూ. 2లక్షలు పలికిన లడ్డూ

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 17: ఎకో ఫ్రెండ్లీ గణపతి నిమజ్జనం మంగళవారం కన్నులపండువగా సాగింది. కర్నూలు పాతనగరంలోని పెద్దమార్కెట్ సమీపంలో తుంగభద్ర ఒడ్డున 63 అడుగులతో మట్టి వినాయకుడిని నెలకొల్పారు. మంగళవారం ఈ గణనాథుని సంబరాల మధ్య తుంగభద్రమ్మ నది ఒడిలోకి సాగనంపారు. ఫైర్ ఇంజన్ల సహాయంతో, గణనాథుని మట్టిని కరిగిస్తూ ఆ మట్టి నీళ్లు తుంగభద్రలో కలిసేలా ఏర్పాట్లు చేశారు. సుమారు ఐదు గంటలపాటు సాగిన ఈ వేడుకను తిలకించేందుకు వందలాదిగా ప్రజలు తరలివచ్చారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన వేడుకలు రాత్రి పది గంటల వరకు కొనసాగాయి. నిమజ్జనానిక ముందు భారీ ఎకో గణనాథుడికి భక్తులు విశేష పూజలు చేశారు. శ్రీలక్ష్మీ నరసింహ వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వినాయకుడికి ముందుగా పూజాదికాలు నిర్వహించారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ఎస్వీ విజయమనోహరి దంపతులు స్వామి వారికి పుజలు చేసి నిమజ్జనాన్ని ప్రారంభించారు. అంతకు ముందు నిర్వహించిన స్వామివారి లడ్డూ ప్రసాదం వేలంపాట పోటాపోటీగా సాగింది. స్వస్తిక్ డెవలపర్స్ సంస్థ అధినేత కాంచనం సురేష్ బాబు రూ.2 లక్షలకు వేలం పాడి లడ్డూ దక్కించుకున్నారు. స్వామివారి వద్ద పెట్టిన హుండీని కూడా వేలం వేయగా భక్తులు చింటూ, భరత్, వికాస్‌లు మహా గణపతి స్వామివారి రూ.1,45,000కు దక్కించుకున్నారు. భారీ మహాగణపతి మూర్తి నిమజ్జన కార్యక్రమంలో సాయంత్రం స్థానిక చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నగర మేయర్ బీవై రామయ్య, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, వీహెచ్‌పీ నాయకులు సందడి సుధాకర్, డాక్టర్ మోక్షేశ్వరుడు, పీపీ గురుమూర్తి, టీసీ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

వంట నూనె మంట



- భారీగా పెరిగిన ధరలు
- లీటర్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు బాదుడు
- కొనలేమంటున్న సామాన్యులు

ఆదోని, సెప్టెంబరు 17 : వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించడంతో వాటి ధరలు ఒక్కసారిగా పెంచేశారు. లీటరుపై రూ.30 వరకు పెరగడంతో ప్రజలపై భారం పడుతోంది. దీంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో ధరలు మరింత పెరుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

రూ.15 నుంచి రూ.50కు పెంపు

వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచుతున్నట్లు కేంద్ర ప్రకటించడంతో వాటి ధరలు ఒక్కసారిగా పెంచారు. లీటరుపై రూ.25 నుంచి రూ.50 వరకు పెరిగాయి. శనివారం ఉదయం లీటరుకు రూ.115గా ఉన్న పొద్దు తిరుగుడు నూనె ధర, సాయంత్రానికి రూ.140 నుంచి రూ.150కి పైగా అమ్మకాలు జరిగాయి. చిల్లర దుకాణాల్లో మరింత ఎక్కువే అమ్ముతున్నారు. రూ.86 పలుకుతున్న పామోలిన్ ధర లీటరు రూ.115 అయింది. మరికొన్ని రోజుల్లో పండగల సీజన్ కూడా ప్రారంభం కానున్న నేపథ్యంలో మధ్యతరగతి ప్రజల నెత్తిన భారం పడింది. ముడి పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ నూనెలపై ఇప్పటి వరకు ఎలాంటి దిగుమతి సుంకం ఉండేది కాదు. తాజాగా వాటిపై 20 శాతం సుంకాన్ని వేయడంతోనే ఆయిల్ ధరలు భారీగా పెరిగినట్లు అమ్మకందారులు పేర్కొన్నారు.



ధరల పెంపుపై వినియోగదారుల ఆగ్రహం

వంట నూనెల ధరల పెంపుతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిల్వ ఉన్న సరుకును కూడా ఎక్కువ ధరలకు విక్రయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్‌లో ధరలు మరింత పెరుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. పామోలిన్ రేట్ హోల్‌సేల్‌లో లీటరు రూ.110 అమ్ముతుండగా, చిల్లరగా రూ.115 చొప్పున విక్రయిస్తున్నారు. పొద్దుతిరుగుడు నూనె కొన్ని చిల్లర దుకాణాల్లో లీటరు రూ.140 నుంచి రూ.150 చొప్పున విక్రయిస్తుండటం గమనార్హం. పూజలకు ఉపయోగించే వివిధ రకాల నూనెల లీటరు ధర మొన్నటి వరకు రూ.109 వరకు ఉండగా అవి ఇప్పుడు రూ.120కి చేరాయి. కంపెనీల నుంచి మూడు రోజులుగా లోడింగ్ కూడా నిలిచిపోయిందని వ్యాపారులు అంటున్నారు. వంట నూనెల ధరలు శనివారం ఉదయం వరకు, ఎమ్మార్పీ కంటే తక్కువగా ఉన్నాయి. దిగుమతి సుంకం పెంపుదలపై ప్రకటన రావడంతో ఎక్కడికక్కడ ధరలు పెంచారు. ఎమ్మార్పీ ఎంత ఉంటే అంతే ధర నిర్ధయించారు. ఆన్‌లైన్ సంస్థల్లోనూ కొద్దిసేపు వంట నూనెల అమ్మకాలను నిలిపివేసి పెంచిన ధరలతో సవరించాయి.

అవన్నీ వదంతులే



అనుమానితుడితో మాట్లాడుతున్న పోలీసులు

కోసిగి, సెప్టెంబరు 17: ఎవర్నీ ఎవరూ చంపలేదని, అవన్నీ వదంతులేనని తేలింది. ఓ యువకుడు బాలికను హత్య చేశాడన్న వార్త మంగళవారం కోసిగిలో కలకలం రేపింది. దీనికితోడు చెత్త పేపర్లు ఏరుకునే యువకుడికి రక్తపు మరకలు అంటడంతో అనుమానాలకు మరింత తావిచ్చినట్టయింది. కోసిగి సంతలో కనిపించిన ఆ యువకుడిని అక్కడున్న వారు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకొని ఆ యువకుడిని స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ చంద్రమోహన్ విచారించగా తాను ఆసుపత్రిలో చెత్త ఏరుకునే సమయంలో కిటికీ అద్దం పగిలి చేతికి గాయమైందని చెప్పాడు. ఎస్‌ఐ చంద్రమోహన్ మాట్లాడుతూ చెత్త పేపర్లు వేరుకునే ఆ యువకుడు ఎవరినీ చంపలేదని, చెత్త ఏరుకునే క్రమంలో కిటికీ గ్లాసు పగిలి చేతికి గాయమైందని అన్నారు. పుకార్లను నమ్మవద్దని ఆయన కోరారు.

ఘనంగా విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి



విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17: విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విశ్వాన్ని సృష్టించిన రూపకర్త విరాట్ విశ్వకర్మ భగవాన్ అని అన్నారు. మారుతున్న కాలాన్ని అనుసరించి ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా బీసీలందరూ అభివృద్ధి చెందాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తా అన్నారు. జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య మాట్లాడుతూ విరాట్ విశ్వకర్మ భగవాన్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ధనుంజయ్, కులమాల శ్రీనివాసాచారి, విజయాచారి, కల్లూరు రాఘవాచారి, ఆదినారాయణాచారి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కవలలకు ఒకేసారి ఎంబీబీఎస్ సీట్లు

కేఎంసీలో అడ్మిషన్ పొందిన విద్యార్థినులు



కేఎంసీలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన కవలలు దాక్షాయణి, దక్షిత

కర్నూలు (హాస్పిటల్), సెప్టెంబరు 17: కవల పిల్లలు సాధారణంగా ఒకేలా ఉంటారు. ఆటలు, పాటలు, చదువు, దినచర్యల్లో ఒకే అభిరుచులను కలిగి ఉంటారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని సుబ్బరావుపేటకు చెందిన సత్యనారాయణ శెట్టి, కళావతి దంపతులకు ద్రాక్షాయణి, దక్షిత అనే కవలపిల్లలు ఉన్నారు. వీరు కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్లను ఒకేసారి సాధించారు. సత్యనారాయణ శెట్టి కిరాణం వ్యాపారం చేస్తూ తమ పిల్లలకు కష్టపడి చదివించారు. ఈయనకు నలుగురు సంతానం ఇద్దరు కవలలు. పెద్దమ్మాయి ద్రాక్షాయని నీట్‌లో 661 మార్కులు సాధించి స్టేట్‌లో 348 ర్యాంకు వచ్చింది. చిన్నమ్మాయి దక్షిత 667 మార్కులతో స్టేట్‌లో 251 ర్యాంకు సాధించింది. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీలో స్టేట్ కోటా కింద మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ సీట్లకు ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ అడ్మిషన్లు నిర్వహించారు. కవలలు ద్రాక్షాయని, దక్షితలను ఒకేసారి మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొందారు. ఇద్దరు కవలలను, వారి తల్లిదండ్రులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఇద్దరు కవలలు ఒకే బ్యాచ్‌లో ఎంబీబీఎస్ సీట్లు సాధించడం అరుదని ప్రిన్సిపాల్ తెలిపారు.



కవలలను ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో చేర్పించుకుంటున్న ప్రిన్సిపాల్

కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం

- రెండు రోజుల్లో 79 మంది చేరిక

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 17: కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ వెల్లడించారు. మెడికల్ కాలేజీలో 198 ఎంబీబీఎస్ సీట్లలో స్టేట్ కోటా కింద మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ సీట్లకు మొదటి రెండు రోజుల్లో 79 మంది కొత్త విద్యార్థులు అడ్మిషన్ పొందారు. మొదటి విడత అడ్మిషన్లు ఈ నెల 19న మధ్యాహ్నం 3 గం టల వరకు జరుగుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే ఆలిండియా కోటా కింద 37 సీట్లలో 20 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు చేరినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

జీఎన్ఎం నర్సింగ్ అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 17: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జీఎన్ఎం అడ్మిషన్ నోటిఫికేషన్ 2024-25 ప్రభుత్వ స్కూల్స్‌లో జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నెలల ఇంటర్న్‌షిప్ వ్యవధితో సహా 3 సంవత్సరాల కోర్సు ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు ఈ నెల 13 నుంచి 23 వరకు ఉంటుందని, డౌన్‌లోడు చేసిన దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఈ నెల 25న సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ నోటిఫికేషన్ ఆన్‌లైన్ అప్లికేషన్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ డీఎంఈ.ఏపీ.ఎన్ఐసీ.ఇన్‌లో అందుబాటులో ఉంటుందన్నారు.

పారా మెడికల్ కోర్సులకు మూడో విడత కౌన్సెలింగ్ పూర్తి

పారా మెడికల్ కోర్సులకు 2024-25 విద్యాసంవత్సరాలకు సంబంధించిన మూడో విడత కౌన్సెలింగ్ మంగళవారం పూర్తయినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె. చిట్టి నరసమ్మ తెలిపారు. మొదటి ఫేజ్ కౌన్సెలింగ్ పూర్తయిందని కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థులు ఏ కారణం చేతనైనా ఫీజు చెల్లించకపోతే సదరు సీట్లును వచ్చే నెలలో జరిగే రెండో ఫేజ్ కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామన్నారు.



సీతారం ఏచూరి సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

ఏచూరి స్ఫూర్తితో ముందుకెళ్లాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 17: దివంగత సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభను సీపీఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. గఫూర్ మాట్లాడుతూ ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలతో మంచి అనుబంధం ఉన్న నాయకుడు ఏచూరి అని శ్లాఘించారు. ఏచూరి గొప్ప మేధావి అని, గొప్ప పార్లమెంటేరియన్ అని, ప్రధానులు ఎవరు ఉన్నా ఆయన ప్రసంగాన్ని శ్రద్ధగా వినేవారని గుర్తు చేశారు. డి. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ ఏచూరీకి జిల్లాతో మంచి అనుబంధం ఉందని అన్నారు. ఎన్ఆర్‌సీ, సీఏఏ సభల్లో పాల్గొని మైనారిటీలకు భరోసా ఇచ్చారని తెలిపారు.

దేశం గర్వించదగ్గ నాయకుడు ఏచూరి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి

ఏచూరి దేశం గర్వించదగ్గ నాయకుడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి కొనియాడారు. రాజ్యసభ సభ్యునిగా ఆయన నిరాడంబర జీవితం గడిపారని, సొంతంగా కారు నడుపుతూ పార్లమెంటుకు వచ్చే వారని గుర్తు చేసుకున్నారు. అలాంటి మహనీయులు పని చేసిన ఎస్ఎఫ్ఐలో వారి అడుగుజాడల్లో పనిచేయడం వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. నిజాయితీగా ఉండటం ఆయన నేర్పించారని అన్నారు. అందుకే ఏచూరిది మచ్చలేని జీవితం అని కొనియాడారు. ఇందిరాగాంధీని రాజీనామా చేయించిన మగధీరుడు ఏచూరి అని మాజీ మంత్రి మూలింటి మారెప్ప అన్నారు. తాను చదువుకునే రోజుల్లో కమ్యూనిస్టు సభలకు వెళ్లేవాడినని గుర్తు చేసుకున్నారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి సవరణలు చేయించిన నాయకుడు ఏచూరి అని అన్నారు. ఏచూరికి భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో ప్రతివాదుల్లో దిట్టగా సీతారాం ఏచూరి నిలిచారని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య అన్నారు. భారతీయులంతా సమానమేనని చాటిచెప్పిన నాయకుడు ఏచూరి అని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఈ సభలో సీపీఐ నాయకుడు జగన్నాథం, జనసేన రాష్ట్ర నాయకుడు పీబీవీ సుబ్బయ్య, ఎస్‌యూసీఐ నాయకుడు నాగన్న, జనసేన కర్నూలు ఇన్‌చార్జి అర్షద్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కే ప్రభాకరరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి. నిర్మల, నగర కార్యదర్శులు రాముడు, బీసీ సాధికార కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, వైద్యుడు ఓబుల్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు.

నవోదయలో కళా ఉత్సవాలు ప్రారంభం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు17: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి నవోదయ విద్యాలయంలో మంగళవారం కళా ఉత్సవాలను ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ఉత్సవాలు 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులను ప్రాంతీయ స్థాయి ఎంపికకు కేరళలోని కోజికోడ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దాసవాణి సాహిత్యం



సంగీత కచేరి నిర్వహిస్తున్న శేషగిరి దాసరు

మంత్రాలయం, సెప్టెంబరు 17: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో దాసవాణి సాహిత్యం భక్తులను ఆకట్టుకుంది. మంగళవారం అనంత చతుర్దశిని పురస్కరించుకుని రాయచూరు చెందిన శేషగిరిదాసరు గోపాల్ గుడిబండి, శ్రీపాదదాస, వాసుదేవ కస్బే సంగీత కచేరీ నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

ముగిసిన పీఠాధిపతుల చాతుర్మాస దీక్షలు



పీఠాధిపతులను సన్మానిస్తున్న సుబుదేంద్రతీర్థులు

మంత్రాలయం, సెప్టెంబరు 17: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, కర్ణాటకలోని వాదిరాజమఠం పీఠాధిపతి అక్షోభ రామప్రియ తీర్థులు, వ్యాస రాజమఠం స్వామీజి విద్యా మనోహర తీర్థులు చాతుర్మాస దీక్షలను ముగించారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి ఊంజల మండపం వద్ద మంత్రాలయం పీఠాధిపతి నగదు, వెండి చెంబు, తట్ట, పట్టువస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షింతలు ఇచ్చి సత్కరించారు. ఇతర మఠాలకు చెందిన ఇద్దరు పీఠాధిపతులు మంత్రాలయం పీఠాధిపతిని సన్మానించారు. పండిత కేసరి విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, రాజాఎస్ అప్రమేయాచార్, ఏఏవో మాధవశెట్టి పాల్గొన్నారు.

వైభవంగా అనంత పద్మనాభ వ్రతం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పూర్ణబోధ పూజా మందిరంలో అనంత చతుర్దశిని పురస్కరించుకుని మూలరాముల సంస్థాన పూజను నిర్వహించారు. ఉదయం నుంచి రాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండిత కేసరి, విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, గౌహతి రిటైర్డ్ చీఫ్ జడ్జి జస్టిస్ శ్రీధర్‌రావు, ఏఏవో మాధవశెట్టి పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి లక్ష కుంకుమార్చన

శ్రీశైలం, సెప్టెంబరు 17: శ్రీశైల మహాక్షేత్రంలో మంగళవారం పౌర్ణమిని ఘడియలను పురస్కరించుకుని సాయంత్రం భ్రమరాంబాదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా అర్చకులు పూజా సంకల్పం పఠించి అనంతరం మహాగణపతికి పూజలు చేశారు. తరువాత శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చనను జరిపించారు. అదేవిధంగా ఆలయంలో శ్రీగిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగింపుగా గిరిప్రదక్షణ చేశారు.

వైభవంగా ఊయలసేవ, పల్లకీ ఉత్సవం : శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ, పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో వైభవంగా ఉత్సవాన్ని నిర్వహించారు.



లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు



గిరిప్రదక్షిణలో పాల్గొన్న అధికారులు, భక్తులు

మాజీ మంత్రి బుగ్గనపై చర్యలు తీసుకోవాలి

- ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 17: సీఎఫ్ఎంఎస్ ద్వారా ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకుండా అడ్డుకున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకొని ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. గత సంప్రదాయం ప్రకారం 5 సంవత్సరాలు పూర్తయిన వారికి మినిమమ్ స్కేల్ ఇవ్వాలని, గత ప్రభుత్వంలో తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, నాలుగు సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్ కింద పని చేస్తున్న వారికి వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు, సెప్టెంబరు 17: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త బస్టాండు సమీపంలో ఆర్కే లాడ్జిలో పృథ్వీరాజ్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక కొత్తపేటకు చెందిన పృథ్వీరాజ్ డిగ్రీ చదువును మధ్యలోనే ఆపేసి వ్యాపారం చేయాలని తిరుగుతున్నాడు. తండ్రి ఇటీవల ఏదైనా ఉద్యోగం చేసుకోవాలని సూచించాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఆర్కే లాడ్జిలో ఉరి వేసుకుని కనిపించాడు. తండ్రి వెంకటస్వామి సంఘటనా స్థలానికి వెళ్లి లాడ్జి తలుపులు పగులకొట్టి పృథ్వీరాజ్‌ను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వ్యాపారం కోసం ఇంట్లో ఎవరికీ తెలియకుండా రూ.10 లక్షలు అప్పు చేసినట్లు తెలిసింది. వ్యాపారం నష్టం రావడంతో అవమానంగా భావించిన పృథ్వీరాజ్ ఈ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాములపాడు, సెప్టెంబరు 17: మూడు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లిన గుండు సిద్ధయ్య (32) మంగళవారం వాగులో శవమై తేలిన సంఘటన మండలంలో చోటు చేసుకొంది. ప్రమాదవశాత్తు కాలువలో పడి మరణించాడా.. లేక ఎవరైనా హత్య చేసి కాలువలో పడేశారా అనే చర్చ గ్రామస్థుల్లో జరుగుతోంది. మండలంలోని ఎర్రగూడూరు గ్రామానికి చెందిన గుండు సిద్ధయ్య ఈ నెల 14న ఇంటి నుండి వెళ్లాడని, 16వ తేదీ పాములపాడు పోలీస్ స్టేషన్‌లో కనబడటం లేదని ఫిర్యాదు చేశారని అన్నారు. వాణాల గ్రామ సమీపంలోని కొర్రపోలు వాగు వద్ద మృతదేహం లభ్యమైందని తెలిపారు. పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని అన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తమ్ముడిపై గొడ్డలితో అన్న దాడి

- తీవ్ర గాయాలు ● ఆరుగురిపై కేసు నమోదు

గడివేముల, సెప్టెంబరు 17: తమ్ముడిపై అన్న గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలోని ఎల్‌కే తండాలో చోటు చేసుకుంది. మంత్రునాయక్ అతడి సోదరుడు బాలస్వామినాయక్‌లకు ఇంటి ముందు ఉన్న ప్రభుత్వ బోరుకు పైపులైన్ వేసుకునే విషయంలో ఘర్షణ జరిగింది. దీంతో మంత్రునాయక్ బాలస్వామి నాయక్‌పై గొడ్డలితో దాడి చేసి గాయపరిచాడు. దాడిని అడ్డుకోబోయిన బాలస్వామినాయక్, తల్లి నాగినిబాయి, తండ్రి నాగేనాయక్‌లను మంత్రునాయక్ భార్య లక్ష్మీబాయి, మామ కమలనాయక్, బావమరుదులు రామకృష్ణనాయక్, కృష్ణనాయక్, శ్రావణిబాయి రాళ్లతో, కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. దీంతో నాగేనాయక్, నాగినిబాయి గాయాలపాలయ్యారు. బాధితుడు బాలస్వామినాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆయిల్ దుకాణాలపై విజిలెన్స్ తనిఖీలు

- పది కేసులు నమోదు

కర్నూలు, సెప్టెంబరు 17: నగరంలోని కల్లూరు ఎస్టేట్‌లో ఉన్న పలు ఆయిల్స్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు సీఐ సునీల్ కుమార్, డీసీడీవో రమణ తదితరులు కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. ఆయిల్ పరిణామాల్లో తేడాలు ఉండటం, ధరల పట్టికలు కనపరచకపోవడంపై పది కేసులు నమోదు చేశారు. అలాగే డోన్‌లో సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటనారాయణ ఈ తనిఖీలు చేశారు. అక్కడ కూడా మూడు కేసులు నమోదు చేశారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు


కేక్‌ను కట్ చేస్తున్న నగరూరు రాఘవేంద్ర, బీజేపీ నాయకులు

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 17: భారత ప్రధాని నరేంద్ర మోదీ 74వ జన్మదిన వేడుకలను నగరంలోని 46వ వార్డు అశోక్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు అశోక్ నగర్‌లోని ద్వారకామాయి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజాలు చేశారు. అనంతరం మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి భారీ కేక్‌ను కట్ చేశారు. ఈసందర్భంగా నగరూరు రాఘ వేంద్ర మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారత ప్రధాన మంత్రులు బుల్లెట్ ప్రూఫ్ అద్దాల మధ్య స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించుకునే దుస్థితి ఉండేదని విమర్శించారు. నేడు నరేంద్ర మోదీ భారత్‌ను ప్రపంచ దేశాల్లోనే మొదటి స్థానంలో నిలుపుతూ ఈ దేశ ఘనతను చాటి చెబుతున్నారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు లోకేశ్వరయ్య, వేల్పుల గోపాల్, బెస్త ఈరన్న, చిన్న ఉమన్న, కందుకూరి సూర్యకుమార్ పాల్గొన్నారు.

నేడు నగర పాలక స్టాండింగ్ కమిటీ సమావేశం

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 17: నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం మేయర్ బీవై.రామయ్య అధ్యక్షతన నిర్వహిం చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సమావేశంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. నగర పాలక నిధులతో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య బీమా చెల్లించాలనే ఉద్దేశంతో స్టాండింగ్ కమిటీ ఏజెండాలో పొందుపరిచారు. అయితే కార్మికులకే కాకుండా రెగ్యులర్ ఉద్యోగులు, కార్పొరేటర్లకు కూడా ఆరోగ్య బీమా నగర పాలక సంస్థ చెల్లించేవిధంగా కమిటీ సమావేశంలో తీర్మానం చేసేందుకు ఏజెండాలో ఎలా పొందరుపరుస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు.

టైం స్కేల్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 17: టైం స్కేల్ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆ సంఘం నాయకులు పి.సుంకన్న, మద్దయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో నాన్ టీచింగ్ టైం స్కేల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా చాలి చాలనీ వేతనాలతో పని చేస్తున్న నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు అనేక దఫాలుగా వినతి పత్రాలు ఇస్తున్నా అధికారులు, నాయకులు తమ గోడు పట్టించుకోవడం లేదని వాపోయారు. కాంట్రాక్టు ఉద్యోగులకు టైం స్కేల్ చేయడానికి పాటించిన నియమ నిబంధనల ప్రకారం, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం పొందిన తరువాతనే టైం స్కేల్ చేశారని, అయితే కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు తమను టార్గెట్ చేసుకుని బురద చల్లే ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

కల్లూరు, సెప్టెంబరు 17: కల్లూరు అర్బన్ 27వ వార్డు గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో శ్రీరామ్‌నగర్‌లో రూ.25 లక్షలతో డబ్ల్యూబీఎం రోడ్డు పనులకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జవాజి గంగాధర్‌గౌడు, జిల్లా కార్యదర్శి కేతూరు మధు, విశ్వం, చరణ్ యాదవ్, రవి, బీజేపీ నాయకులు రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

కల్లూరు, సెప్టెంబరు 17: నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా కె.మార్కా పురంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థుల్లో ఎదుగుదలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రాపౌట్ లేకుండా చూడాలి

సి.బెళగల్, సెప్టెంబరు 17: విద్యార్థులు డ్రాపౌట్ లేకుండా చూడాలని ఎంఈవో ఆదాం బాషా అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో హెచ్ఎంలతో ఆయన సమావేశమయ్యారు. ఎంఈవో ఆదాం బాషా మాట్లా డుతూ గ్రామాల్లో పనులు లేక తల్లిదండ్రులు వలస వెళ్తుంటారని, వారి వెంట తమ పిల్లలను తీసుకెళ్లాకుండా వారికి అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

దాడి కేసు నమోదు

కర్నూలు, సెప్టెంబరు 17: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎరుకలి కుమార్, ప్రభాకర్ నాయుడులపై దాడి కేసు నమోదైంది. గణేష్ నగర్‌కు చెందిన వీరిద్దరు శేఖర్‌గౌడు అనే వ్యక్తి ఆటోలో మద్యం సేవిస్తున్నారు. దీంతో శేఖర్ గౌడు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అతనిపై దాడి చేసి గాయపరిచారు. శేఖర్‌గౌడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా హిందీ దివస్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 17: ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో మంగళవారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ వంటి పరీక్షలు ఎదుర్కొవడానికి హిందీ బాషా ఉపయోగ పడుతుందన్నారు. అనంత రం విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సీలం బాషా, డాక్టర్ దివాకర్ దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్‌పై అవగాహన అవసరం


గుడ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ బాలస్వామి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 17: న్యూట్రిషన్‌పై అవగాహన అవసరమని డాక్టర్ కే.బాలస్వామి అన్నారు. మంగళవారం నగరంలోని టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో న్యూట్రిషన్ వారోత్సవాల సందర్భంగా అనంత ఎడ్యుకేషన్, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, ఎన్ఈసీసీల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరైన ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని, పాశ్చాత్య పోకడలతో వంటలు, పిండి వంటలు మరచిపోయి స్ట్రీట్ ఫుడ్, జంక్‌ఫుడ్‌లను తిని తమ ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటు న్నారన్నారు. అనంతరం విద్యార్థులకు కోడిగుడ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.సుంకన్న, డాక్టర్ మలిందర్ స్వామి, రంగ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్‌బాబు, రాజేంద్ర ప్రసాద్, పి. మోసేస్, సురేష్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం: డీపీవో

ఓర్వకల్లు, సెప్టెంబరు 17: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యమని డీపీవో నాగరాజు నాయుడు, ఎంపీడీవో శివనాగప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఈవోఆర్డీ సుబ్బరాయుడు, నన్నూరు గ్రామంలో ఎంపీడీవో శివనాగప్రసాద్, హుశేనాపురంలో సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ, గుట్టపాడులో సర్పంచ్ మోహన్ రెడ్డి, ఆయా గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, సర్పంచ్ బ్రహ్మయ్య, నాయకుడు విజయుడు పాల్గొన్నారు.

కల్లూరు: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని కర్నూలు డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు మండలం ఉలిందకొండలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ నాయకులు ఈవీ.రమణ. రంగస్వామిరెడ్డి హాజరయ్యారు. అనంతరం జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎల్‌డీఓ మాట్లాడారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్ మీదుగా రాజ్‌విహార్ కూడలి వరకు నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ శాంతకుమారి, స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

గూడూరు: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగర పంచాయతీ ఛైర్మన్ జె వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి కమిషనర్ రవికుమార్ అన్నారు. మంగళవారం గూడూరు నగర పంచాయతీ పరిధిలో స్వచ్ఛతా హి సేవలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్‌లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగ స్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఏఈ నరసింహులు, మెప్మా టీఎంసీ సూర్యనారాయణ, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.




ఉలిందకొండలో చీపురుతో పరిసరాలను శుభ్రం చేస్తున్న డీఎల్‌డీఓ, ఓర్వకల్లు, సి. బెళగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



నన్నూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీవో నాగరాజు నాయుడు


గూడూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్మన్, ఇన్‌చార్జి కమిషనర్

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ సందీప్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్య దర్శులు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు విరాళాలు


ఎమ్మెల్యే గౌరు చరితకు విరాళం అందజేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితులకు మంగళవారం మాధవీనగర్‌లోని గౌరు స్వగృహంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు టీడీపీ నాయకులు చెక్కులు అందజేశారు. కల్లూరు అర్బన్ 33వ వార్డు టీడీపీ నాయకులు ఎన్వీ. రామకృష్ణ, రైతుసంఘం నేత సంపతి లక్ష్మీరెడ్డి, పోలిరెడ్డి, వరద బాధితుల సహాయార్థం రూ.1,40,000 చెక్కును అందజేశారు. లక్ష్మీపురం గ్రామ ప్రజలు రూ.1,55,555, రాజ్‌కిరణ్ రోడ్ లైన్స్ ట్రాన్స్‌పోర్టు సంస్థ యజమాని రవీందర్ రూ.10వేలు, బన్నూరుకు చెందిన టీడీపీ నాయకులు అశోక్‌రెడ్డి, బొమ్మిరెడ్డి, హరినాథరెడ్డి, పెరుగు దుర్గాప్రసాద్ రెడ్డి, పగిడ్యాల రాజశేఖర్ రెడ్డి రూ.80 వేలు, 19వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ప్రభాకర్ యాదవ్ రూ.25 వేలు, పందిపాడు టీడీపీ నాయకుడు అయ్యపురెడ్డి రూ.25 వేలు, గడివేముల మండలం కరిమద్దెల గ్రామ టీడీపీ నాయకులు రూ.90,600, పాణ్యం మండలం, నెరవాడ గ్రామ టీడీపీ నాయకులు రూ.50 వేలు, రేమడూరు గ్రామ ప్రజలు రూ.10,016, టీడీపీ నీయకుడు కురువ ధనుంజయ రూ.15,016, పర్ల గ్రామ నాయకులు రూ. 2,51,116, కల్లూరు మండలం, నెరవాడ టీడీపీ నాయకులు రూ.28వేలు, చెట్లమల్లాపురం గ్రామ నాయకులు రూ.50 వేలు, పుసులూరు టీడీపీ నాయకుడు కృష్ణ రూ. 29, 500, చెక్కులను ఎమ్మెల్యేకు అందజేశారు. అదే విధంగా కల్లూరు మండలం టీడీపీ అధ్యక్షుడు డి.రామాంజినేయులు రూ.60,660, 34వ వార్డు టీడీపీ నాయకుడు పీయూ మాదన్న రూ.25వేలు, 28వ వార్డు దూపాడు ప్రజలు రూ.20,100, సల్కాపురం టీడీపీ నాయకుడు దేవేందర్ రెడ్డి 1,10,116, యాపర్లపాడు గ్రామ ప్రజలు రూ.20 వేలు, ఓర్వకల్లు మండలం, శకునాల గ్రామ టీడీపీ నాయకులు రూ.20 వేలు, ఉయ్యాలవాడ టీడీపీ నాయకులు డి.రమణారెడ్డి రూ.10 వేలు నగదును పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్నూలు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తమరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: విజయవాడ వరద బాధితులను ఆదుకు నేందుకు దాతలు ముందుకు వచ్చారు. మంగళవారం మండలంలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పరమేశ్వరరెడ్డితోపాటు గ్రామ నాయకులు గ్రామంలో విరాళాలు సేకరించి రూ.20 వేల నగదును ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డికి అందజేశారు. అలాగే ఓర్వకల్లు పొదుపు మహిళా సంఘాల తరపున గ్రామ టీడీపీ నాయకులు పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి 48 చీరలు, పంచలు కొనుగోలు చేసి విజయవాడకు తరలించారు. అలాగే శకునాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మౌళీశ్వరరెడ్డి రూ.25వేల నగదును ఎమ్మెల్యే గౌరు చరితకు అందజేశారు.

పోడియం ఎత్తు తగ్గింపు


కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో...

కల్లూరు, సెప్టెంబరు 17: రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూ రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియం ఎత్తు తగ్గించారు. వినియోగదారులకు కుర్చీలు వేసి మర్యాదపూర్వకంగా సేవలు అందిస్తున్నారు.

ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17: ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న 45 మంది గ్రేడ్-2 వీఆర్వోలకు ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో రాజేశ్వర్‌కు వీఆర్వో గ్రేడ్-2 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేడ్-2 వీఆర్వోల సమస్యలను పరిష్కరించాలని అధికారులను విజ్ఞప్తి చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి తలారి మహేష్, కోశాధికారి కుమారి యాదవ్, వీరస్వామి, సుభాన్ పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్టు

కర్నూలు, సెప్టెంబరు 17: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారుపేటలో నాటుసారాను విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ నాగరాజరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ఎన్ఆర్‌పేటకు చెందిన మోహన్, సురేష్, అనిల్‌కుమార్ బంగారుపేటకు వచ్చి నాటుసారా కొను గోలు చేస్తున్నట్లు గుర్తించారు. వీరిని అరెస్టు చేసి వీరి వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు: ఏవో

సి.బెళగల్, సెప్టెంబరు 17: నకిలీ పురుగుల మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం సి. బెళగల్, పోలకల్లు, ముడుమాల గ్రామాల్లోని పురుగుమందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు విక్రయించే ప్రతి పురుగుమందులకు బిల్లులు తప్పనిసరి అందజేయాలన్నారు. ఎంపీఈవోలు సిద్దు, వెంకటేశ్వర్లు ఉన్నారు.


మందులను పరిశీలిస్తున్న ఏవో

వేమన శతక పుస్తకాల పంపిణీ


పుస్తకాలను అందజేస్తున్న వేమన భావప్రచార సమితి సభ్యులు

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 17: కర్నూలు జిల్లా యోగి వేమన భావ ప్రచార సమితి ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో వేమన శతక పుస్తకాలను ఉచి తంగా పంపిణీ చేశారు. ఎ.క్యాంపు ప్రభుత్వ పాఠశాల, ఎస్‌ఏపీ క్యాంపులోని పీఆర్ఆర్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఆరో తరగతి విద్యార్థులకు 600 యోగా వేమన శతకం పుస్తకాలను అంద జేశారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ ఎం.కృష్ణారెడ్డి, గౌరవాధ్యక్షుడు ఎండీ వరప్రసాద్, రిటైర్డు ప్రిన్సిపాల్ ఎంసీటీ రమణారెడ్డి, న్యాయవాది యోగి వేమన భావప్రచార సమితి సభ్యులు ఎస్.రంగా రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యనారాయణరెడ్డి, న్యాయవాదులు కాటం శ్రీనివాసరెడ్డి, ఏ.వెంక టరెడ్డి, డి.మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఓజోన్ పరిరక్షణపై అవగాహన

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 17: ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా బి.క్యాంపు పాఠశాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి వీఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి, ప్రొఫెసర్ మధు కుమార్, బాలికల పాఠశాల హెచ్ఎం ప్రశాంతి, నిర్మల, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రంగమ్మ హాజరై మాట్లాడారు. ఓజోన్ పరిరక్షణకు కాలుష్యాన్ని తగ్గించడమే ఏకైక మార్గమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

రైతులకు తక్కువ ధరకే భోజనం


రైతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

కర్నూలు (అగ్రికల్చర్), సెప్టెంబరు 17: కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల కోసం తక్కువ ధరకే భోజనాన్ని అందించే కార్యక్రమాన్ని కర్నూలు మార్కెట్ కమిటీ అధికారులు ప్రారంభించారు. శ్రీగురుదత్త సహ కారంతో ఈ కార్యక్ర మాన్ని మొదలు పెట్టడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల నుంచి కేవలం రూ.15 మాత్రమే వసూలు చేస్తామని, మరో రూ.10 మార్కెట్ కమిటీ భరిస్తుందని, మిగిలిన మొత్తాన్ని ధార్మిక సంస్థ అందిస్తున్నట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు తెలిపారు.

సమస్యల వలయంలో ఎంఈఓ కార్యాలయం

» వర్షం పడితే గదులన్నింటిలోనూ నీరే

» ఇబ్బంది పడుతున్న సిబ్బంది

ఓర్వకల్లు, సెప్టెంబరు 17: ఓర్వకల్లు విద్యాశాఖ అధికారి కార్యాలయ భవనం పైకప్పు పెచ్చులూడి పడిపోవడంతో వర్షం పడితే. గదులు వెలుస్తున్నాయి. గదులు చెమ్మగిల్లుతున్నాయి. ఈ భవనంలో మూడు గదులు ఉన్నాయి. ఇందులో ఒకటి ఎంఈవో కార్యాలయం, మరో రెండు చిన్న గదుల్లో కంప్యూటర్ ఆపరేటర్, సిబ్బందికి మరో పెద్ద గదికి పుస్తకాలు ఉంచేందుకు ఉపాధ్యాయుల సమావేశం కోసం వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం స్లాబ్‌లో పెచ్చులూడటంతో వర్షం నీరు కారుతుంది. పుస్తకాలు ఉంచే గది గోడలు చెమ్మగిల్లుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబ్ నుంచి వర్షం నీరు దారలా వెలిసింది. అయితే గతంలో దాదాపు రూ. రెండు లక్షలతో కలరింగ్ చేయించడమే తప్ప.. స్లాబ్ ఔట్‌లో ప్లాస్టింగ్ చేయడం మరిచారు. గత్యంతరం లేక పుస్తకాలు ఉండే గదిలో సిబ్బంది ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఓర్వకల్లు ఎంఈవో కార్యాలయం ఇదే..

డోన్ సీఐపై చర్యలు తీసుకోవాలి

బార్ అసోసియేషన్ డిమాండ్


జిల్లా ప్రధాన న్యాయాధికారికి వినతి పత్రం ఇస్తున్న న్యాయవాదులు

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 17: డోన్ సీఐపై చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. డోన్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మిశెట్టి ప్రసాద్‌పై పట్టణ పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేసినందుకు నిరసనగా కర్నూలు బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్దిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఓ సివిల్ కేసులో పిటిషనర్ తరఫున డోన్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మిశెట్టి ప్రసాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా సీఐ ఇంతియాజ్ బాషా న్యాయవాదిపై సెక్షన్ 447, 427ల కింద న్యాయవాదిపై అతని కుమారుడు స్థల యజమానిలపై కేసులు నమోదు చేశారు. వీరిపై లక్ష్మిశెట్టి ప్రసాద్ కర్నూలు బార్ అసోసియేషన్ న్యాయవాదులతో కలిసి జిల్లా ప్రధాన న్యాయాధికారికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి తాను నంద్యాల ఎస్పీని పిలిపించి వారితో మాట్లాడి చట్టప్రకారం తగు చర్యలు తీసుకుంటామని న్యాయవాదులకు హామీ ఇచ్చారు. ఆ తర్వాత కర్నూలు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ న్యాయవాదిపై అక్రమంగా పెట్టిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు మాసిపోగు సుబ్బయ్య, న్యాయవాదులు మోహన్ రెడ్డి, తిరుపతయ్య, ఎం.వెంకటేశ్వర్లు, మంజునాథ్, డోన్ న్యాయవాదులు లక్ష్మిశెట్టి ప్రసాద్, సంతోష్, కే.మహేష్, పులిదామోదర్ ఉన్నారు.

నగర బలిజ సంఘం అధ్యక్షుడిగా లక్ష్మన్న



కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 17: కర్నూలు నగర బలిజ సంఘం అధ్యక్షుడిగా కర్నూలు మండలం, పెద్దపాడుకు చెందిన జి.లక్ష్మన్న నియమితుల య్యారు. మంగళవారం నగరంలోని ఆర్ఎస్ రోడ్డులోగల హెచ్‌డీటీసీ కాంప్లెక్స్‌లోని నగర బలిజ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో బలిజ సంఘం నాయకులు నూతన అధ్యక్షుడిని నియమించారు. ఈ సందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ నగరం లోని కాపు, తెలగ, బలిజ సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని, టీడీపీ ప్రభుత్వం బలిజ, కాపులకు ప్రకటించిన వివిధ సంక్షేమ పథకాల అమలు జరిగేలా చూస్తామని అన్నారు. ఈ సమావేశంలో నగర బలిజ సం ఘం నాయకులు పత్తి ఓబులయ్య, రవి, ఈశ్వర్, శోభన్‌బాబు, శైలేష్, అమర్ నాథ్, ప్రేమ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు జూనియర్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 17: స్థానిక గుడ్ షఫర్డ్ పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా జూనియర్ అండర్-19 విభాగంలో బాలబాలికలకు షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులతో పాటు క్రీడా ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతో ఉదయం 9.30 గటలకు హాజరు కావాలన్నారు. 01.04.2005 తర్వాత జన్మించిన వారు ఎంపిక పోటీల్లో పాల్గొనాలన్నారు.

నేడు టేబుల్ టెన్నిస్‌కు..

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 17: డీఎస్ఏ స్టేడియంలో బుధవారం స్కూల్ గేమ్స్+2 టేబుల్ టెన్నిస్ బాలబాలికల ఎంపిక నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి హర్షవర్దన్ అధ్యక్షుడు వై. పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనవలెనని తెలిపారు.

21న స్కూల్‌గేమ్స్‌కు..

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 17: డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 21న జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, సెపక్‌తక్రా, కరాటే క్రీడాంశాలలో అండర్-14, 17 బాలబాలికలకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి తెలిపారు. వివరాలకు 9573098008ను సంప్రదించాలన్నారు.

బాబోయ్ కుక్కలు

» హడలిపోతున్న జనం


వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

గూడూరు, సెప్టెంబరు 17: గూడూరు నగర పంచాయతీ పరిధిలో కుక్కల బెడద కారణంగా జనం హడలిపోతున్నారు. గూడూరు నగర పంచాయతీ పరిధిలో దాదాపు ఇరవైఐదు వేల వరకు జనాభా ఉంది. 20 వార్డులు ఉన్నాయి. 2011 సంవత్సరం గూడూరు మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మారింది. అయితే అభివృద్ధి నామ మాత్రంగా ఉంది. కాలనీల్లో కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో కుక్కల బెడద కారణంగా నగర పంచాయతీ అధికారులు కుక్కల నివారణకు చర్యలు చేపట్టారు. ప్రసుతం పట్టణంలో ఏ వీధిలో చూసినా కుక్కల బెడద ఎక్కువైందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోలుకోలేక మహిళ మృతి

దేవనకొండ, సెప్టెంబరు 17: ఈనెల 11న ఆత్మహత్యకు యత్నించిన గుండ్లకొండ గ్రామానికి చెందిన సువర్ణ (53) మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. భర్త సుంకన్న వ్యవసాయానికి రూ.8 లక్షల అప్పుచేయడంతో ఎలా తీర్చాలో తెలియక పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు కర్నూలు తరలించగా సోమవారం మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ హయాంలోనే తాగు నీటి పథకాలు: ఎమ్మెల్యే బీవీ


తాగునీటి పథకం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

గోనెగండ్ల, సెప్టెంబరు17: తెలుగుదేశం ప్రభుత్వంలోనే తాగునీటి పథకాలు సాధ్యమని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద జలజీవన్ మిషన్ ఎంపీఎస్ పథకం కింద రూ.19.50కోట్లతో చేపట్టను న్న తాగునీటి పథకం పనులకు భూమి పూజ చేశారు. 2017లో నాటి సీఎం చంద్రబాబు 11 గ్రామాల్లో తాగు నీటి సమస్య పరిష్కరించేందుకు రూ.13.50కోట్లు మంజూరు చేశారన న్నారు. వైసీపీ ప్రభుత్వంతో పనులు నిలిచి పోయాయని, రెండోసారి 2024లో భూమి పూజ చేసి పనులు చేయలేద న్నారు. టీడీపీ ఇచ్చిన హామీలను దశలవారీగా పూర్తిచేస్తుందన్నారు. తహసీల్దార్ కుమారస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస రెడ్డి, టీడీపీ నాయకులు నజీర్, తిరుపతయ్య నాయుడు, నూర, చంద్రశేఖర పాల్గొన్నారు.

పత్తికొండను అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు


విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

మద్దికెర, సెప్టెంబరు 17: పత్తికొండను ఛాలెంజింగ్‌గా తీసుకుని అభివృద్ధి చేస్తామని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.23లక్షలు విలువ చేసే వాహనాలను 96 మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు. తాలుకాలో 68 చెరువులను హంద్రీనీవా నీరు నింపుతామన్నారు. వైసీపీ హయాంలో 30 శాతం పనులు కూడా చేయలేదన్నారు. రహదారులు, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇళ్లస్థలాల సమస్యను తీరుస్తానని సీఎం చంద్రబాబును పత్తికొండకు రావాలని కోరామన్నారు. దివ్యాంగుల ఏడీ ఫాతిమా, ఇన్‌చార్జి ఎంపీడీవో స్వర్ణలత, తహసీల్దార్ హుశేన్‌సాబ్, జడ్పీటీసీ మురళిధర్ రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచ్ సుహాసిని, మాజీ జడ్పీటీసీ పి.పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, దాత పారా విశ్వనాథ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజ యుడు, తెలుగు యువత అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, రాయల్ చౌదరి, ప్రత్యేకాధికారి ఉమాదేవి పాల్గొన్నారు.

విద్యార్థినులు ఇష్టపడి చదవాలి

విద్యార్థినులు ఇష్టపడి చదవాలని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం పెరవలి జడ్పీ పాఠశాలలో విద్యార్థినులకు ఆర్టీటీ మంజూరుచేసిన సైకిళ్లను అందజేశారు.

సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయుల వినతి

కస్తూర్బా పాఠశాలలో తాగునీటి వసతి కల్పించాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, అధికారులు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


విశ్వకర్మ చిత్రపటాన్ని ఊరేగిస్తున్ననాయకులు

మంత్రాలయం, సెప్టెంబరు 17: మంత్రాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం తుంగభద్ర నది ఒడ్డున గంగా దేవికి పూజలు నిర్వహించి దుర్గమ్మ గుడి దగ్గర విశ్వకర్మ చిత్రపటాన్ని కలశంలో ఉంచి పూజలు చేసి ధ్వజారోహణ చేశారు. విశ్వకర్మ చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వీకేసీ ప్రహ్లాదాచార్, వీకేసీ రాఘవేంద్ర, గోపాలకృష్ణ, మురళి, సత్యనారాయణ, మౌనేష్‌ఆచార్, పద్మనాభాచార్ పాల్గొన్నారు.

హొళగుంద:

ఆదర్శ ప్రాయుడు విరాట్ విశ్వ కర్మ అని, ఆయనను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని విశ్వకర్మ సంఘం నాయకులు రైస్ మిల్ మురళి, పత్తార్ శ్రీనివాస్, మంగళవారం తెలిపారు. విశ్వ కర్మ జయంతిని నిర్వహించారు. కమ్మరి, వడ్ల, స్వర్ణకార, శిల్ప, కంచరి వంటి వివిధ వృత్తులతో సమాజానికి అవసరమైన వస్తువులను తయారు చేసుకునేందుకు ఆయన చేసిన సేవలు ఎనలేనివని కోనియాడారు అనంతరం స్థానిక మారెమ్మ దేవాలయం నుండి దేవమ్మ దేవాలయం వరకు విశ్వ కర్మ చిత్రపటాన్ని ఊరేగించారు. జక్కన చారి, పత్తార్ అశోక్ కుమార్, రాజా ఆచారి, వీరేష్ ఆచారి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

మద్దికెర, సెప్టెంబరు 17: చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పత్తికొండ సీడీపీవో లలిత అన్నారు. మంగళవారం పేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషక ఆహార ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించండి


కలెక్టర్‌ను కలిసిన బత్తిన కిరణ్

తుగ్గలి, సెప్టెంబరు 17: మండలంలోని సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ రంజిత్ బాషాకు విన్నవించినట్లు టీడీపీ నాయకుడు బత్తిన కిరణ్ తెలిపారు. మంగళవారం కర్నూలులో కలెక్టర్‌ను కలిసి బీసీ హాస్టల్, మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి : బుట్టా


పంటను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ బుట్టా

గోనెగండ్ల, సెప్టెంబరు17: అధిక వర్షాలలో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీ బుట్టా రేణుక డిమాండ్ చేశారు. మంగళవారం వేముగోడు, హెచ్. కైరవాడి గ్రామాల్లో పంటలను పరిశీలించారు. బుట్టా శివనీలకంఠ, వెముగోడు కృష్ణారెడ్డి, ప్రమెదొరెడ్డి, గడ్డం నారాయణ రెడ్డి, బందేనవాజ్, మురళీ నాయుడు, కాశిరెడ్డి, మన్సూర్, రాముడు, రవికుమార్‌రెడ్డి, పెద్దారెడ్డి, దొరబాబు, మునెప్ప, రంగారెడ్డి, బాబులాల్ పాల్గొన్నారు.

కుల వివక్షపై కేసు నమోదు

నందవరం సెప్టెంబరు 17: మండల కేంద్రంలో టీ బంకు నిర్వహిస్తున్న వినోద్ కుమార్ రెండు గ్లాసుల పద్ధతిపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాల మేరకు.. తిప్పరాజు, ఇసాక్ ఐదురోజుల క్రితం బస్టాండ్‌లో టీ తాగడానికి వెళ్లగా దళితులమైన తమకు ప్లాస్టిక్ గ్లాస్‌లో ఇచ్చారని ఇదేమని అడగగా టీ ఇవ్వడమే ఎక్కువని కులం పేరుతో దూషిం చినట్లు ఫిర్యాదు చేశారు.

నులిపురుగుల నివారణకు కృషి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 17: నులిపురుగుల నివారణకు కృషి చేద్దామని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ పిలుపు నిచ్చారు. మంగళవారం కళాశాలలో వైద్య సిబ్బంది నులుపురుగు నివారణపై ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఏఎన్ఎం లక్ష్మి ఆశా వర్కర్లు భారతి, మారెమ్మ, ఎన్‌సీసీ ఆఫీసర్‌లు జోనాతాన్ వీక్లిఫ్, ఉమాదేవి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

తుగ్గలి, సెప్టెంబరు 17: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో రమావెంకటేశ్ గౌడ్ ఆదేశించారు. మంగళవారం కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఇచ్చిన శిక్షణా తరగతుల్లో చేసిన వంటలనుపరిశీలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం: మండలంలోని మాధవరం సమీపంలో బైక్‌పై మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. వివరాల మేరకు.. మాధవరం గ్రామానికి చెందిన బోయ గూర్మింటి రామయ్య కర్ణాటక నుంచి మూడు మద్యం బాక్సులు తెస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. కోసిగి దొడ్డి బెళగల్‌కు చెందిన ఈడిగ శివకుమార్, బోయ బంగారు బాబు, గూర్మింటి రామయ్యను అరెస్టు చేసి బైక్‌ను సీజ్ చేశారు. కేసు నమోదుచేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

కోసిగి, సెప్టెంబరు 17: సాతనూరు, అగసనూరు పంప్ హౌస్ వద్ద కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్ర మోహన్ తెలిపారు. వివరాల మేరకు.. హనుమేష్ గోవిందు నుంచి మద్యం 1536 టెట్రా ప్యాకెట్లు కలిగిన 16 బాక్సులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండుకు తరలిచారు. ఏఎస్ఐ నాగరాజు, కానిస్టేబుల్ తిప్పన్న పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 17: విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధనపురం ఉదయ్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పేద విద్యార్థులు కళాశాలలో ఫీజు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని వాపోయారు. నవీన్, వినీల్, రాజ్ కుమార్, విక్రం పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్పులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు17: ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రిజిస్ట్రేషన్ కార్యాలయంగా మారింది. ఈ మేఉరకు మంగళవారం ఎమ్మిగనూరులో మార్పులు చేశారు. గతంలో సబ్ రిజిస్ట్రార్ స్థానం ఎత్తుగా ఉండేది. అయితే దిమ్మెను తొలగించి, ముందుగా నలుగురు కూర్చునేందుకు కుర్చీలను ఏర్పాటు చేశారు. ఆవరణలో బెంచీలను ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారికి టీ, కాఫీలు సైతం అందజేస్తు న్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్రిచక్ర వాహనాల పంపిణీ

హొళగుంద, సెప్టెంబరు 17: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు, 267 వస్తువులను పంపిణీ చేసినట్లు ప్రత్యేక అధికారి నాగేశ్వరావు, ఎంపీడీవో సుహాసీనమ్మ, నీతి అయోగ్ అస్పిరేషనల్ బ్లాక్ సమన్వయకర్త రవిశంకర్ తెలిపారు.

రిజర్వేషన్ సాధించాలి

హాలహర్వి, సెప్టెంబరు 17: వాల్మీకులు ఉద్యమాలు చేసి ఎస్టీ రిజర్వేషన్ సాధించాలని వీఆర్పీస్ రాష్ట్ర కార్యదర్శి రామభీంనాయుడు కోరారు. మంగళవారం శిరుగాపురం గ్రామంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెదేపా ప్రభుత్వం వాల్మీకులకు పెద్ద పీట చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి పార్లమెంటులో బిల్లు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ నాయుడు, రాముడు, మల్లికార్జున పాల్గొన్నారు.

దాడికి ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలి


గోనెగండ్లలో ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోనెగండ్ల, సెప్టెంబరు17: కల్లుకుంటలో గోవిందమ్మపై దాడికి ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గంజహళ్లి మహ దేవ్, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ధర్నా నిర్వహించి, తహసీల్దార్ కుమార స్వామికి వినతి పత్రం అందజేశారు. దినేష్, నాగేష్, చంద్రశేఖర్, నరసిం హులు, మహేష్, మద్దిలేటి, రవి, నాగేష్, పాపన్న పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: దళిత మహిళను వివస్త్రను చేసి అవమానించినా కలెక్టర్, ఎస్పీ, అధికారులు గ్రామాన్ని సందర్శించలేని స్థితిలో ఉన్నారని ఎమ్మార్పీఎస్ మాజీ నాయకులు బొగ్గుల తిక్కన్న, గుమ్మల లక్ష్మన్న, జమ్మన్న ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బాధితురాలు గోవిందమ్మను పరామర్శించారు.

దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

కోసిగి: దళిత మహిళ గోవిందమ్మపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించాలని కోసిగి మండల దళిత నాయకులు సోల్మాన్‌రాజు, దేవన్న, ఎంపీటీసీ రాజు, లింగమూర్తి, మాదేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మిగనూరులో చికిత్స పొందుతున్న గోవిందమ్మను పరామర్శించారు.

నిందితులను ఉపేక్షించొద్దని వినతి

పెద్దకడుబూరు: దళిత మహిళపై దాడి చేసిన నిందితులను ఎంతటి వారినైనా ఉపేక్షించొద్దని హైకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్, అమరేష్ ఎస్ఐ నిరంజన్ రెడ్డిని కోరారు. మంగళవారం వినతి పత్రం పత్రం అందజేశారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 17: ఉద్యోగ ఉపాధ్యాయులకు దసరా కానుకగా మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రఘురామయ్య మండల అధ్యక్షుడు ముత్తన్న డిమాండ్ చేశారు. నాగరాజు మల్లికార్జున కౌతాళం, హొళగుంద, ఆదోని మండలం నాయకులు హనుమంత్ రెడ్డి, గోపి నాయక్, సంగమేశ్వర్ భీమ్ రెడ్డి, మల్లన్న, భాస్కర్ ,అశ్వత్థప్ప, రాఘవేంద్ర, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి

ఆస్పరి, సెప్టెంబరు 17: మండలంలోని రైతులకు వెంటనే సబ్సిడీ శనగ విత్తనాలు ఇవ్వాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, రైతు సంగం మండల అధ్యక్షుడు మధు రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఏవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. మండలంలో నల్లరేగడి భూములు అధికంగా ఉన్నాయని రబీలో పప్పుశనగ వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. నెలాఖరులోపు 70శాతం సబ్సిడీతో విత్తనాలను ఇవ్వాలని కోరారు. రామాంజినేయులు, వీరన్న, నరేంద్ర, చౌదరి, శ్రీనివాసులు, రాజేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

ఆలూరు, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితులకు బెళ్లిగుండు ఆంజనేయ సేవా సమితి, సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలూరులో విరాళాలు సేకరించారు. మొత్తం రూ.50,116 మంగళవారం తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు అందజేశారు..

టీడీపీ నాయకుల విరాళం

మంత్రాలయం, సెప్టెంబరు 17: వరద బాధితులకు రచ్చుమర్రి టీడీపీ నాయకులు రూ. 60,500లు అందజేసి చేయూత అందించారు. రాఘవేంద్రరెడ్డి సోదరుడు రామ కృష్ణారెడ్డికి నగదు అందజేశారు. ఊశేని, శ్రీనివాసులు, శివప్ప, పాలాక్షి, జనసేన అధ్యక్షుడు యోసేపు పాల్గొన్నారు.

దేశానికి మోదీ సేవలు అవసరం: ఎమ్మెల్యే


రక్త దాతను అభినందిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, సెప్టెంబరు 17: మోదీ సేవలు దేశానికి అవసరమని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. మోదీ 74వ జన్మదినం సందర్భంగా స్థానిక భావసార క్షత్రియ కల్యాణ మంటపంలో యువ మోర్చా ఆధ్వర్యంలో మెగారక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, పట్టణం అధ్యక్షుడు జిందే సాయి కుమార్‌తో పాటు 74 మంది రక్తదానం చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, స్వచ్ఛత హి సేవ రాయలసీమ జోన్ ఇన్‌చార్జి గుడిసె దేవానంద్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, విట్టా రమేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్, ఓబీసీ మోర్చా సోషల్ మీడియా రాష్ట్ర కో కన్వీనర్ యూసీ ముని స్వామి, యువ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆచారి, వెల్లల మధుసూదన్ శర్మ రసాలే గోవింద రావు పాల్గొన్నారు.

స్వచ్ఛత హి సేవ ర్యాలీ

మునిసిపల్ చైర్ పర్సన్ వాల్మీకి శాంత అధ్యక్షతన నిర్వహించిన ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేపర్ కవర్‌లు, బట్ట కవర్లను ఉపయోగించడం ద్వారా ప్లాస్టిక్ కవర్ల వినియోగం పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఆర్‌వో అస్లాం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: మోదీ జన్మదిన వేడుకలను మంగళవారం బీజేపీ కార్యకర్తలు నిర్వహిచారు. ముఖ్య అతిథి ఎమెల్యే బీవీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, జిల్లా కార్యదర్శి నరసిం హులు, గుడిసె శివ, జగ్గాపురం చిన్న ఈరన్న పాల్గొన్నారు.

దేవనకొండ: పరిశుభ్రతకు పాటుపడాలని ఎంపీడీవో గౌరీదేవి, ఈవోఆర్డీ సూర్యనారాయణ అన్నారు. కరివేముల గ్రామంలో స్వచ్ఛత సేవను ప్రారంభించారు. గిడ్డయ్య గౌడ్, వన్నూరప్ప పాల్గొన్నారు.

హొళగుంద: మండలంలో ఈనెల 17నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు స్వచ్ఛత సేవ నిర్వహించనున్నట్లు డీఎల్‌డీవో నాగేశ్వర్ రావు, ఎంపీడీవో సుహాసినమ్మ, పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్ మంగళవారం తెలిపారు. టీడీపీ నాయకులు బీజే పొంపాపతి, దిడ్డి వెంకటేష్ పాల్గొన్నారు

కోసిగి: సర్పంచ్ సంజీపోగు అయ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ అలీ ఆధ్వర్యంలో వాల్మీకిసర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, జ్ఞానేష్, పెండ్యాల భరద్వాజశెట్టి, కొండగేని ఈరారెడ్డి, ఎంపీటీసీ రాజు, మహాదేవ, వెంకటేశ్ పాల్గొన్నారు.

కౌతాళం: ఎంపీడీవో సుబ్బరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామ కార్యదర్శి శివప్ప, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణతో కలసి ర్యాలీ చేపట్టారు. వల్లూరులో తెలుగు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్ గ్రామ ప్రజలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆలూరు: ప్రధాన నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం ఆలూరు పట్టణంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు.

నందవరం: విద్యార్థులు ఇప్పటి నుంచే స్వచ్ఛతను అలవర్చుకోవాలని టీడీపీ నాయకుడు గురురాజారావు దేశాయి అన్నారు. సర్పంచ్ సావిత్రి, ఏవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వచ్ఛత సేవ నిర్వహించారు. మాజీ సర్పంచ్ రామన్నగౌడు, లక్ష్మి నారాయణ, తోటపాండు, దానియల్, విద్యాకమిటి చైర్మన్ శివ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 17: పట్టణంలోని సెయింట్ అంతోని ఉన్నత పాఠశాల 2004-05 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. పాఠశాలలో అందరూ కలుసుకొని నాడు పాఠశాల జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తరగతి గదిలోకి వెళ్లి కూర్చొని స్నేహితులు ఒకరికొకరు కబుర్లు చెప్పుకున్నారు. ఆయా ప్రాంతాలలో వివిధ ఉద్యోగాలలో వృత్తులలో స్థిరపడిన 20 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని సంతోషాన్ని పంచుకున్నారు. నాటి గురువులు ఫాదర్ జార్జ్, ఫాదర్ డేవిడ్, కేశవయ్య, మారెన్న, ఎల్లే చిన్నప్ప, ప్రతాపరెడ్డి, థామస్, శాంతాగ్రేష్, సామెల్‌ను సన్మానించారు. పూర్వ విద్యార్థులు యువరాజు, విష్ణు, హేమాద్రి, రాజు, నాగరాజు, అశోక్, విజయ్ పాల్గొన్నారు.

దాడులు పునరావృతం కాకుండా చర్యలు


కల్లుకుంటలో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పెద్దకడుబూరు, సెప్టెంబరు17: దళితులపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. మంగళవారం కల్లుకుంట గ్రామాన్ని సందర్శించారు. దళిత గోవిందమ్మ దాడిపై అధికా రులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ పికెటింగ్ పరిశీలించారు. ఎస్ఐ నిరంజన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనాథ్, ఆర్ఐ మహేష్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి ఉతీర్ణత పెంచాలని, డ్రాప ఫుట్ విద్యార్థులను గుర్తించి, బడిలో చేర్పించాల న్నారు. తహసీల్దార్ శ్రీనాథ్, ఎంపీడీవో జనార్ధన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి కూమార్ పాల్గొన్నారు

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

ఆదోని రూరల్: తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డుల గదిని పరిశీలించారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు

గోనెగండ్ల, సెప్టెంబరు17: చింతలముని నల్లారెడ్డి దశమి ఉత్సవాలను పురుష్క రించుకొని ఎడ్ల బండలాగుడు బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ పోటీలు గోనెగండ్ల ట్రాక్టర్ యునియన్ సహకారంతో ఈనెల 23, 24 తేదిలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి హాజరవుతున్నట్లు వివరించారు.

విరాళాల సేకరణ అభినందనీయం : ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, సెప్టెంబరు17: వరదబాధితులకు నిత్యావసర సరుకులు సేకరిండంపై ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అభినందించారు. స్థానికుడు షబ్బీర్ ఆధ్వర్యంలో వరదబాధితుల కోసం పట్టణంలో సేకరించిన సరుకుల లారీకి ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. దేవేంద్ర మూర్తి, అఫ్రిది, టీడీపీ నాయకులు సలీం, సలాం, నవాజ్, కౌన్సిలర్ అమాన్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం చేయూత..

పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు రూ.లక్ష విలువగల నిత్యవసర సరుకులు, దుస్తులు, బెడ్‌షీట్స్ సామగ్రిని మంగళవారం వాసవీకల్యాణ మండపంలో సామాజిక కార్యకర్త డా మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజుకు అందజేశారు. సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సెక్రటరీ ప్రవీణ్, ట్రెజరర్ నాగకుమార్, సోషల్ వర్కర్ గిరి, రఘు, రంగస్వామి, మల్లెల గ్రూప్స్ సభ్యులు సామెల్, రవి, ముత్తు, ఆజీత్, సతీష్, హనుమంతు, పవన్, రంజిత్ రెడ్డిలు పాల్గొన్నారు.


వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ


కోసిగిలో విరాళాలు సేకరిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర: ఎడవలి గ్రామానికి చెందిన గ్రామస్థులు ఇచ్చిన రూ.35వేలు విరాళాన్ని సర్పంచ్ నంది కల్పన, మాజీ సర్పంచ్ ఆకుల ఆనంద్ రూ.50వేలు మొత్తం రూ.85వేలను ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు మంగళవారం అందజేశారు.

రూ.3 లక్షల విరాళాల సేకరణ

కోసిగి: మంత్రాలయం టీడీపీ నాయకుడు ఎన్.రాఘవేంద్రరెడ్డి సూచన మేరకు మండల టీడీపీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించినట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, మండల కన్వీనర్ జ్ఞానేష్, నాడిగేని అయ్యన్న తెలిపారు. మంగళవారం విరాళాలు సేకరించారు. సర్పంచ్ అయ్యమ్మ రూ.5వేలు, ఫర్టిలైజర్స్, ఆర్ఎంపీ డాక్టర్లు, లారీ అసోసియేషన్ సభ్యులు, రేషన్ డీలర్లు, ప్రజలు, టీడీపీ నాయకులు, వ్యాపారస్థుల సహకారంతో రూ3 లక్షలు విరాళాలు వచ్చాయని వీటిని టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపనున్నట్లు తెలిపారు. అయ్యప్ప, అర్జున్, నరసింహులు, తిమ్మప్ప, బసవరాజు, దొడ్డయ్య, వీరేష్ ఉన్నారు.